జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 21 ‖ సోమవారం ‖ 5-10-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



05 అక్టోబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:10 సూర్యాస్తమయం - సా. 5:58 తిథి దశమి రా. 2:08ం వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పుష్యమి రా. 11:07 వరకు తరువాత ఆశ్లేష యోగం శివ ఉ. 9:45 వరకు కరణం వనిజ మ. 3:01 వరకు విష్టి రా. 2:08ం వరకు వర్జ్యం ఉ. 7:51 నుండి ఉ. 9:23 వరకు దుర్ముహూర్తం మ. 12:28 నుండి మ. 1:15 వరకు మ. 2:49 నుండి మ. 3:36 వరకు రాహుకాలం ఉ. 7:39 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:36 నుండి మ. 12:04 వరకు గుళికాకాలం మ. 1:33 నుండి మ. 3:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:34 నుండి తె. 5:22 వరకు అమృత ఘడియలు సా. 5:01 నుండి సా. 6:33 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:40 నుండి మ. 12:28 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## విశ్వ విజేతలను కలవడం గర్వంగా ఉంది



అంధ మహిళా క్రికెటర్ల జీవితాలు ఆదర్శం

గురుదేవ ట్రస్ట్ సేవలు అమూల్యం

హిందుస్థాన్ షిప్ యార్డ్ భాగస్వామ్యం అద్భుతం

కొండపల్లి శ్రీనివాస్

దేశ క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడే విధంగా 2025 విశ్వ విజేతలుగా నిలిచిన అంధుల మహిళా క్రికెటర్లను కలవటం చాలా గర్వంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళ పాలెం గురుదేవ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు



## ఐదుగురు పిల్లలను కనండి

హిందూ యువత త్వరగా పెళ్లి చేసుకోవాలి: గజేంద్రసింగ్ పటేల్

జనాభా మార్పులపై ఆందోళనతోనే ఐదుగురు పిల్లల సూచన



# బాబు విజన్.. దేశానికే దిక్సూచి

## 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

### బుర్రిపాలెం నుంచి గృహ నిర్మాణానికి నాంది

### 3డీ టెక్నాలజీతో 117 ఇళ్ల నిర్మాణం

**2029 నాటికి పేదలందరికీ సొంతిల్లు: చంద్రబాబు**

**మరో 3 లక్షల ఇళ్లకు కేంద్రం హామీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**

తెనాలి, అక్టోబర్ 4: పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అదే సమయంలో దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో తరువాయి 2 వ పేజీలో..



## పది రోజుల పండుగ..

మైసూరు దసరా తరహాలో విజయవాడ ఉత్సవ్ 2.0

పది రోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు

ప్రజలందరికీ ఉచిత ప్రవేశం: ఎమ్మెల్యే బొండా ఉమా

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మైసూరు దసరా తరహాలో విజయవాడలో పది రోజులపాటు విజయవాడ ఉత్సవ్ 2.0 ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

అద్వైత, విజయవాడ, అక్టోబర్ 4: అక్టోబర్ 11 నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలు మాకినేని బసవపున్నయ్య స్టేడియంతో పాటు పున్నమి ఘాట్, ఇతర ప్రాంతాల్లోనూ కొనసాగుతాయని తెలిపారు. దసరా సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నారని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ 2.0లో భాగంగా సింగ్‌నగర్ స్టేడియంలో భారీ ఎగ్జిబిషన్ స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్, మ్యూజికల్ ఈవెంట్స్, వివిధ వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు బొండా ఉమా వెల్లడించారు. ముఖ్యంగా ప్రజలందరికీ ఉచిత ప్రవేశం తరువాయి 2 వ పేజీలో..



## సోమనాథ్ బాటలో 1100 మంది భక్తులు

**సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనానికి 1100 మంది భక్తులు పయనం**

**విజయవాడ నుంచి ప్రత్యేక రైలును ప్రారంభించిన బొండా ఉమా**

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రముఖమైన సోమనాథ్ జ్యోతిర్లింగ క్షేత్ర దర్శనానికి విజయవాడ నుంచి 1100 మంది భక్తులు ఆదివారం ప్రత్యేక యాత్రకు బయలుదేరారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి 1000 ఏళ్లు పూర్తవడం, ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ సందర్భంగా... మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోమనాథ్ స్వాభిమాన్ యాత్రలో భాగంగా ఈ ప్రత్యేక రైలును విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు.

## ఓటర్ల జాబితాపై విపక్షాల సమరం

**ముంబైలో ఉద్ధవ్--రాజ్ ఠాక్రే గర్జన.. జజుజ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. ముంబైలో విరాట్ గర్జన మోర్చా పేరుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సౌత్ ముంబైలోని మెట్రో సినిమా ప్రాంతం నుంచి బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీకి శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే సంయుక్తంగా నాయకత్వం వహించారు.

ముంబై/న్యూఢిల్లీ: కాంగ్రెస్, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ నేతలు కూడా ర్యాలీలో పాల్గొని మద్దతు ప్రకటించారు. పార్టీ జెండాలకు బదులుగా కేవలం జాతీయ జెండాలను చేతబూని తరువాయి 2 వ పేజీలో..



## నేటి రాశి ఫలాలు

**మేషం:** భాగస్వామ్య వ్యాపారాలు లాభాల బాట పడతాయి. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దూరప్రాంతాల బంధువులు నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**వృషభం:** బంధువులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఆశించిన విధంగా రాణించి విశేషమైన లాభాలు పొందుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఏర్పడిన అవరోధాలను అధిగమిస్తారు. వ్యాపారస్తులకు మాత్రం పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. చిన్ననాటి మిత్రులతో కష్టసుఖాలను పంచుకొంటారు.

**సింహం:** నిరుద్యోగుల ప్రయత్నాలు చాలా కష్టం మీద ఫలిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. మొండి బాకీలు వసూలు అవుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**కన్య:** ఉద్యోగాలలో బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది. సంతానం విద్య ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మిత్రులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగిపోతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దూరపు బంధువుల మిత్రుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది.

**తుల:** ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులు అధికారుల సహాయంతో రాజీ చేసుకుంటారు. గృహ నిర్మాణ విషయమై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు.

**వృశ్చికం:** భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తొలగుతాయి. బంధువర్గం నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు ఫలిస్తాయి.

**ధనస్సు:** వృత్తి ఉద్యోగాలలో జీతభత్యాల విషయమై శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మకరం:** ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు.

**కుంభం:** నూతన వ్యాపారాల పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఋణదాతల నుండి ఒత్తిడి తొలగుతుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకొంటారు.

**మీనం:** ఉద్యోగాలలో ఎదురైన సమస్యల నుండి తెలివిగా బయటపడతారు. ధనాదాయం మార్గాలు పెరుగుతాయి. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం అందుకొంటారు. జీవిత భాగస్వామితో విహార యాత్రలో పాల్గొంటారు.







# సోమనాథ్ బాటలో 1100 మంది భక్తులు

**సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనానికి 1100 మంది భక్తులు పయనం.. విజయవాడ నుంచి ప్రత్యేక రైలును ప్రారంభించిన బొండా ఉమా**

విజయవాడ, అక్టోబర్ 4: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ప్రముఖమైన సోమనాథ్ జ్యోతిర్లింగ క్షేత్ర దర్శనానికి విజయవాడ నుంచి 1100 మంది భక్తులు ఆదివారం ప్రత్యేక యాత్రకు బయలుదేరారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి 1000 ఏళ్లు పూర్తవడం, ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ సందర్భంగా... మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోమనాథ్ స్వాభిమాన్ యాత్రలో భాగంగా ఈ ప్రత్యేక రైలును విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక, దేవాలయ పర్యాటకానికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

సోమనాథ్ క్షేత్రం దేశంలోని అత్యంత పవిత్రమైన జ్యోతిర్లింగాల్లో ఒకటని, ఈ విశిష్ట క్షేత్రాన్ని దర్శించుకునే అవకాశం భక్తులకు కల్పించడం అభినందనీయమని బొండా ఉమా అన్నారు. విజయవాడ నుంచి బయలుదేరిన 1100 మంది భక్తులు సోమనాథ్ ఆలయంతో పాటు అక్కడి ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. భక్తుల ప్రయాణం, వసతి, దర్శనం తదితర అంశాలకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన యాత్రను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన ద్వారా ప్రజల్లో భక్తిభావంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై మరింత అవగాహన పెరుగుతుందని బొండా ఉమా పేర్కొన్నారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపునివ్వాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సోమనాథ్ స్వామివారి దర్శనం చేసుకుని యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని భక్తులంతా క్షేమంగా విజయవాడకు తిరిగి రావాలని ఆకాంక్షించారు. ప్రత్యేక రైలు ప్రారంభోత్సవం సందర్భంగా భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది.

# బాబు విజన్.. దేశానికే దిక్సూచి

**మొదటి పేజీ తరువాయి**

చేపడుతున్న పైలట్ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు భూమిపూజ జరిగింది. బుద్రిపాలెం, ఓబులనాయుడుపాలెంలో సుమారు రూ.14 కోట్ల వ్యయంతో 117 ఇళ్లను ఈ సాంకేతికతతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాన్ని కేవలం సంక్షేమ కార్యక్రమంగా కాకుండా సాంకేతికతతో ముడిపెట్టిన అభివృద్ధి కార్యక్రమంగా ముందుకు తీసుకెళ్లాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కనిపించింది. 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికీ పక్కా ఇల్లు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తామని చంద్రబాబు ప్రకటించారు. కేంద్రం తొలుత 3 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపిందని, అయితే రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకుని 9 లక్షల ఇళ్లు కావాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం 28 నెలల్లో సుమారు 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిందని, వచ్చే మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్లను పూర్తి చేసే దిశగా పనులు సాగుతున్నాయని చంద్రబాబు వెల్లడించారు.

3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతను పేదల గృహ నిర్మాణంలో వినియోగించడం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సాధారణ నిర్మాణ విధానంతో పోలిస్తే తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ఇళ్లను నిర్మించే అవకాశం ఈ విధానంతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు సాంకేతికతను విస్తరించే అవకాశం ఉంది. నిర్మాణ వేగం, కార్మిక అవసరం తగ్గడం, నిర్మాణ వ్యర్థాలు తగ్గించడం వంటి ప్రయోజనాలు 3డీ ప్రింటింగ్ విధానంలో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది.

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తన ప్రసంగంలో చంద్రబాబు దూరదృష్టిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్నది చంద్రబాబు సంకల్పమని, ఆయన సంకల్ప బలం గొప్పదని ప్రశంసించారు. 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షల ఇళ్లకు కేంద్రం నుంచి మంజూరు చేయిస్తామని ప్రకటించారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ విధానం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నేడు ఆలోచించే అంశాలను భవిష్యత్తులో దేశం అనుసరించే పరిస్థితి ఉందని వ్యాఖ్యానిస్తూ, సాంకేతికత, అమరావతి అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిపై ఆయన దృష్టిని కొనియాడారు.





కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పేదల గృహ నిర్మాణంతో పాటు నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని నేతలు ప్రస్తావించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణానికి అవసరమైన వనరులు, నిర్మాణ వ్యయం, సరఫరా వ్యవస్థ వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని కార్యక్రమం ద్వారా ప్రభుత్వం స్పష్టం చేసింది. ధరలు పెరగకుండా మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని చంద్రబాబు ప్రశంసించడం కూడా సభలో హైలెట్‌గా నిలిచింది. ఇక కార్యక్రమంలో మరో ప్రత్యేకతగా లబ్ధిదారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేరుగా ముచ్చటించారు. భూమి పూజ అనంతరం లబ్ధిదారుల కుటుంబానికి నూతన వస్త్రాలను అందజేశారు. సొంతింటి కల నెరవేరే దిశగా తొలి అడుగు పడటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. బుద్రిపాలెం నుంచి ప్రారంభమైన ఈ 3డీ గృహ నిర్మాణ ప్రయోగం విజయవంతమైతే పేదల ఇళ్ల నిర్మాణంలో వేగం, నాణ్యత, సాంకేతికతకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది.

# ఓటర్ల జాబితాపై విపక్షాల సమరం

**మొదటి పేజీ తరువాయి**

వేలాది మంది కార్యకర్తలు నిరసనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు కలిగేలా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని నిరసనకారులు ఆరోపించారు. ూ×= ప్రక్రియను రద్దు చేయడంతో పాటు, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లను వినియోగించాలని రాజ్ ఠాక్రే డిమాండ్ చేశారు. ఈ ఉద్యమాన్ని కేవలం పార్టీల కార్యక్రమంగా కాకుండా విస్తృత ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కూడా కలిసి రావాలని ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు పిలుపునిచ్చారు. చాలా కాలం తర్వాత ఇద్దరు ఠాక్రేలు ఒకే వేదికపైకి రావడం మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణే తమ ప్రధాన డిమాండ్లని విపక్ష నేతలు స్పష్టం చేశారు.

మరోవైపు ఇదే అంశంపై దేశ రాజధాని ఢిల్లీలోనూ నిరసనలు ఉధృతమయ్యాయి. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత లోపించిందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ముప్పు ఏర్పడుతోందని ఆరోపిస్తూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసేందుకు ప్రయత్నించిన సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా సహా పలువురిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఇండియా గేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

## పది రోజుల పండుగ..

**మొదటి పేజీ తరువాయి**

కల్పించడం ఈ ఉత్సవ్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా దసరా సెలవులను ఆనందంగా గడిపేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని చెప్పారు. గత ఏడాది విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఈ ఏడాది మరింత ఘనంగా ఉత్సవ్ 2.0ను నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ దసరా ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, హైదరాబాద్ గణేష్ ఉత్సవాల తరహాలో విజయవాడ దసరా వేడుకలు కూడా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0కు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమా తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ నటులు, సంగీత రంగ ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. దసరా ఉత్సవాలతో విజయవాడకు లభించిన ప్రత్యేక గుర్తింపును మరింత పెంచేలా విజయవాడ ఉత్సవ్ నిలవాలని ఆకాంక్షించారు.



# శ్వేత సంపాదకీయం

**సోమవారం 5-10-2026**

## సామూహిక సంపదను కాపాడటం అందరి బాధ్యత

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం నిర్మించే ప్రతి ఆస్తి ప్రజల సొత్తు. రహదారులు, పాఠశాలలు, వైద్యశాలలు, ఉద్యానవనాలు, బస్సులు, రైల్వే స్టేషన్లు, తాగునీటి వ్యవస్థలు, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి అనేక మౌలిక సదుపాయాలు ప్రజల అవసరాల కోసం ప్రజాధనంతో నిర్మించబడతాయి. అయితే ఇవి ప్రభుత్వ ఆస్తులు అనే భావనతో కొందరు వాటి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. వాస్తవానికి ఇవన్నీ ప్రజల సొత్తే. ప్రజల పన్నుల ద్వారా సమకూరిన నిధులతో ఏర్పడిన ఈ ఆస్తులను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రజా ఆస్తుల ధ్వంసం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. నిరసనల పేరుతో బస్సులను తగలబెట్టడం, రైళ్లపై రాళ్లు వేయడం, ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేయడం, వీధి దీపాలను పగులగొట్టడం వంటి ఘటనలు తరచూ కనిపిస్తుంటాయి. ఇలాంటి చర్యల వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. ధ్వంసమైన ఆస్తులను మరమ్మతు చేయడానికి లేదా తిరిగి నిర్మించడానికి మళ్లీ ప్రజల సొమ్మే ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులు అనవసరంగా మరమ్మతులకే పరిమితమవుతున్నాయి.

ప్రజా ఆస్తుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. వాటిని ఉపయోగించే ప్రతి వ్యక్తి బాధ్యత కూడా. బస్సు సీట్లపై రాతలు రాయడం, గోడలపై పోస్టర్లు అతికించడం, పార్కుల్లో చెత్త వేయడం, ప్రజా మరుగుదొడ్లను అపరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించినా సమాజానికి పెద్ద నష్టాన్ని కలిగిస్తాయి. పరిశుభ్రత, క్రమశిక్షణ, బాధ్యత వంటి విలువలు ప్రతి పౌరుడిలో పెంపొందినప్పుడే ప్రజా ఆస్తుల పరిరక్షణ సాధ్యమవుతుంది. విద్యాసంస్థల్లోనే ప్రజా ఆస్తుల విలువ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు సామూహిక సంపదను గౌరవించడం, సంరక్షించడం నేర్పించాలి. పాఠశాలల్లో బెంచీలు, పుస్తకాలు, క్రీడా సామగ్రి వంటి వస్తువులను జాగ్రత్తగా ఉపయోగించే అలవాటు పెంపొందిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి ఈ విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉంది.

డిజిటల్ యుగంలో ప్రజా ఆస్తుల వినియోగం మరింత విస్తరించింది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రజా సౌకర్యాలు, పచ్చదన ప్రదేశాలు, స్మార్ట్ మౌలిక వసతులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. అయితే వాటి సంరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఆశించిన ఫలితాలు దక్కవు. ఒక చెత్తబుట్టను సక్రమంగా ఉపయోగించడం నుంచి ఒక పార్కును పరిశుభ్రంగా ఉంచడం వరకు ప్రతి చిన్న చర్య ప్రజా ఆస్తుల పరిరక్షణలో భాగమే. ప్రజా ఆస్తుల పట్ల బాధ్యతారాహిత్యం సమాజంలో ప్రతికూల సందేశాన్ని పంపిస్తుంది. ఒక వ్యక్తి చేసిన నిర్లక్ష్యం అనేక మందిపై ప్రభావం చూపుతుంది. ధ్వంసమైన బస్సు వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. పాడైన వీధి దీపం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అపరిశుభ్రమైన ప్రజా ప్రదేశాలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. అందువల్ల ప్రజా ఆస్తుల సంరక్షణను వ్యక్తిగత బాధ్యతగా భావించే సంస్కృతి పెరగాలి.

ప్రభుత్వాలు కూడా ప్రజా ఆస్తుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ధ్వంసానికి పాల్పడే వారిపై కఠిన శిక్షలు అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కలిసి ప్రజల్లో బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజా ఆస్తుల పరిరక్షణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదు. అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే ప్రజా ఆస్తుల పట్ల ప్రజల్లో ఉన్న గౌరవం స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడి ప్రజలు సామూహిక సంపదను తమ సొంత ఆస్తిగా భావించి సంరక్షిస్తారు. అదే భావన మన దేశంలో కూడా బలపడాల్సిన అవసరం ఉంది. ప్రజా ఆస్తులను కాపాడటం ద్వారా మాత్రమే అభివృద్ధి ఫలాలు ఎక్కువ కాలం ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

ప్రజా ఆస్తుల పరిరక్షణ అనేది దేశభక్తికి కూడా ఒక రూపం. దేశ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి విలువను గుర్తించి వాటిని కాపాడటం ప్రతి పౌరుడి కర్తవ్యం. మనం వినియోగించే ప్రతి ప్రజా సౌకర్యం వెనుక సమాజం మొత్తం చేసిన పెట్టుబడి ఉంది. ఆ సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు మెరుగైన మౌలిక వసతులను అందించగలుగుతాం. ప్రజా ఆస్తులు కేవలం నిర్మాణాలు కావు. అవి దేశ అభివృద్ధికి ప్రతీకలు. వాటిని కాపాడటం ద్వారా మాత్రమే సమాజ పురోగతి సాధ్యమవుతుంది. ప్రజాధనంతో నిర్మించిన ప్రతి ఆస్తిని మన సొంత ఆస్తిగా భావించి సంరక్షించినప్పుడే బాధ్యతాయుత పౌరసత్వం సార్థకమవుతుంది. ప్రజా ఆస్తుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం కాలానుగుణ అవసరం.



## విశ్వ విజేతలను కలవడం గర్వంగా ఉంది

**అంధ మహిళా క్రికెటర్ల జీవితాలు ఆదర్శం**

**గురుదేవ ట్రస్ట్ సేవలు అమూల్యం**

**హిందుస్థాన్ షిప్ యార్డ్ భాగస్వామ్యం అద్భుతం**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**





విజయనగరం, అక్టోబర్ 4,

దేశ క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడే విధంగా 2025 విశ్వ విజేతలుగా నిలిచిన అంధుల మహిళా క్రికెటర్లను కలవటం చాలా గర్వంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళ పాలెం గురుదేవ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన 2025 అంధుల మహిళా క్రికెటర్లను ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ పరిచయం చేసుకుని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే అంగవైకల్యం అడ్డు కాదని ప్రపంచానికి చాటి చెప్పిన అంధుల మహిళా క్రికెటర్లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారతదేశంలోని 12 రాష్ట్రాల నుండి ఎంపిక కాబడిన ఇండియన్ అంధుల మహిళ క్రికెట్ సభ్యుల ఒక్కొక్కరి జీవిత గాధలు తెలుసుకుంటే వారి నుంచి స్ఫూర్తి పొంది ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జట్టులో తెలుగు రాష్ట్రాలకు చెందిన కెప్టెన్ దీపిక, కరుణ కుమారి ఉండటం గర్వకారణంగా చెప్పుకోవచ్చు.

అలాగే మన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర ప్రాంత బిడ్డ కరుణకుమారి కావటం, ఫైనల్ లో అద్భుతమైన ప్రదర్శనతో జట్టు విజయానికి కీలకంగా నిలవటం మరింత గర్వకారణంగా ఉందని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉరిమే ఉత్సాహంతో మరింతగా క్రీడల్లో రాణించాలని, ఆంధ్రప్రదేశ్లో క్రీడాకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే గురుదేవా ట్రస్ట్ వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అమూల్యమని అన్నారు. మూడు లక్షల మందికి పైగా విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు (ప్రోస్టెటిక్స్) అందజేసి దేశంలోనే నాలుగో స్థానంలో ఉండటం ఈ ట్రస్ట్ మన విజయనగరం జిల్లాలో ఉండటం మరింత గర్వకారణం అన్నారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు కావలసిన అనేక రకాల సదుపాయాలు కల్పించడంతో పాటు వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, కృత్రిమ అవయవాలు, వాకర్లు మరియు చేతి కర్రలు సంస్థ ద్వారా అందించడం వారి సేవా నిరతని తెలియజేస్తుందన్నారు. అలాగే గురుదేవ ట్రస్ట్ ద్వారా క్యాన్సర్ వైద్య సేవలు అందించడం కూడా శుభపరిణామం అన్నారు. విశ్వ విజేతలను తీసుకురావడంతో పాటు వారు గెలుచుకున్న ప్రపంచ కప్ ను సైతం నిర్వాహకులతో మాట్లాడి తీసుకురావడం గురుదేవ ట్రస్ట్ యొక్క విధానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రపంచ కప్ మహిళ అంధుల విజేతలకు హిందుస్థాన్ షిప్ యార్డ్ భాగస్వామ్యం చాలా అద్భుతమనీ, జట్టులోని 16 మందికి ఒక్కరికి 50 వేల రూపాయల నగదు ప్రోత్సాహం అందించడం పట్ల హిందుస్థాన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల చైర్మన్ గుడిపూడి నారాయణస్వామి, హిందుస్థాన్ షిప్ యార్డ్ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్ కిరణ్, ఇండియన్ బ్లైండ్ ఉమెన్ క్రికెట్ చైర్మన్ అజయ్ రెడ్డి, గురుదేవా ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు, డాక్టర్ ఫణీంద్ర, ట్రస్ట్ మెంబర్ బి ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ సమావేశం

కామవరపుకోట, అక్టోబర్ 4, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 17వ తేదీ వరకు భారతీ య జనతా పార్టీ చేస్తున్న "మోదీ సేవా సంకల్ప అభియాన్" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కామవర పుకోట మండలంలో హెల్త్ క్యాంపులు, అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు, త్వరలోనే చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఎస్ ఆర్ ఆర్ లక్ష్మీ సూర్య నారాయణ రాజు అధ్యక్షతన ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బిజెపి కార్యకర్తలందరూ అందుబాటులో ఉండి ఈ కార్యక్రమాలన్నీ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబో యే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంలో భారతీయ జనతా పార్టీ నుండి వార్డు నెంబర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్ అభ్యర్థులు గా నిలబడే విధంగా కృషి చేయాలనీ కార్యకర్తలను కోరారు. భారతీయ జనతా పార్టీ స్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, భారత్ మాత, దీన్ దయాల్ చిత్రపటాలకు పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, ఒంటెద్దు యేసు వరప్రసాద్, కాకి సురేష్ పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తా: శీమకుర్తి శ్రీనివాస్ రావు

జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 4, ఏలూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన శీమకుర్తి శ్రీనివాస్ రావును వాసవి క్లబ్ ఉప్పలమెట్ట కపుల్స్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పూర్వ అధ్యక్షులు ఇమ్మడి బాలభాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, జిల్లాలో ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని శీమకుర్తి శ్రీనివాస్ రావు తెలిపారు. ఉప్పలమెట్ట వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ ఓలేటి కృష్ణ కుమార్, అధ్యక్షులు కొనకళ్ళ సత్యనారాయణ, నాగవరపు పుల్లారావు, బుర్లగడ్డ సత్యనారాయణ, బొమ్మ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

**జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

ఏలూరు, అక్టోబర్, 4 : పిజిఆర్ఎస్ ద్వారా అందిన సేవలపై ప్రజల అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కోరారు. ప్రజలకు మరింత పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ ద్వారా అందించే సేవలపై ప్రజలను అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా కోరుతున్నదన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో ప్రవేశ,నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించడం జరిగిందన్నారు. పి.జి.ఆర్.ఎస్ సేవలు పొందిన ప్రజలు తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూ.ఆర్ కోడ్ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని, సంతృప్తి స్థాయిని తెలియజేయవచ్చన్నారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ చేరుతుందన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. క్యూ.ఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతి మృతి

### మహబూబాబాద్ జిల్లాకు చెందిన సుప్రియ దుర్మరణం

### ట్రక్ ఢీకొట్టడంతో ఘటన.. కుటుంబంలో విషాదం



**మహబూబాబాద్, అక్టోబర్ 4 :**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువతి మృతిచెందిన ఘటన విషాదాన్ని నింపింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ (31) ఉద్యోగ రీత్యా అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం సుప్రియ భారత్‌కు చెందిన మరో మహిళతో కలిసి ఆదివారం ఉదయం రెండు గంటల సమయంలో కారులో ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ వారి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమవగా, సుప్రియ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో కారులో ఉన్న మరో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను సమీప వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక అధికారులు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. సుప్రియ మృతి వార్త మహబూబాబాద్ జిల్లాలోని ఆమె కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. మృతురాలి భర్త కొదుమూరి రంజిత్, అత్తమామలు మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన సుప్రియ అనుకోని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బంధువులు, స్నేహితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, పరిచయస్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాల భద్రతపై మరోసారి చర్చకు దారితీసిన ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో విషాద ఛాయలు నింపింది.




# యువత ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులు కావాలి

### క్రమశిక్షణ, నైతికత విజయానికి పునాది

### విద్యకు సామాజిక బాధ్యత జత కావాలి

### కర్నూలు కళాశాల వార్షికోత్సవంలో వెంకయ్య నాయుడు

**హైదరాబాద్, అక్టోబర్ 4 :**

**యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా కాకుండా, పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కర్నూలు సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణ, నైతిక విలువలకు నిలయంగా పేరుగాంచిన ఈ విద్యాసంస్థ ఎందరో మేధావులను దేశానికి అందించిందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని వెంకయ్య నాయుడు అన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, విలువలు, క్రమశిక్షణను అందించిన ఈ విద్యాసంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి అందించిన గొప్ప కానుకగా నిలిచిందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.**

ఏ రంగంలోనైనా శాశ్వత విజయాన్ని సాధించాలంటే ఓర్పు, దీక్ష, నిరంతర కృషి అవసరమని ఆయన సూచించారు. కష్టపడకుండా విజయాలు సాధించాలనే ఆలోచన సరైనది కాదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని విద్యార్థులకు సూచించారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. విద్యార్థులు విద్య పూర్తి చేసిన తర్వాత ఉపాధి అవకాశాలు సులభంగా పొందేలా పాఠ్యాంశాలను కాలానుగుణంగా రూపొందించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను పెంపొందించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుల పాత్రపై కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారిగానే కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. మంచి గురువులే మంచి పౌరులను తయారు చేస్తారని పేర్కొన్నారు. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. కేవలం సంపాదన ఒక్కటే జీవిత లక్ష్యం కాకూడదని, తాము నివసించే సమాజానికి, దేశానికి ఏమి తిరిగి ఇస్తున్నామనే ఆలోచన ప్రతి యువకుడిలో ఉండాలని అన్నారు. విద్య, విలువలు, సామాజిక బాధ్యత కలిసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# ఓబీసీ కులగణన చేపట్టాలి

### లేకపోతే ఢిల్లీ దిగ్బంధనమే

### దేశవ్యాప్తంగా ఉద్యమానికి పిలుపు

### లక్నో సదస్సులో శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక




**లక్నో, అక్టోబర్ 4 :**

దేశవ్యాప్తంగా జనగణనలో ఓబీసీ కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని, లేకపోతే లక్షలాది మందితో దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో భారీ ఉద్యమాన్ని చేపడతామని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని కస్తూర్బా ఆడిటోరియంలో జాతి జనగణన సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ లీగ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మహమ్మద్ సులేమాన్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ బక్షి సింగ్ వర్మ, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ సూరజ్ యాదవ్ మండల్, డాక్టర్ ఈశ్వర్ ధ్యాన్, ఉమేష్ కోర్రం తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలకు సంబంధించిన జనాభా గణాంకాల అవసరంపై విస్తృతంగా చర్చించారు. ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి ఓబీసీ కులగణన నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ సంఘాలు, నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాల వారీగా పర్యటిస్తూ ఓబీసీ సంఘాలను సంఘటితం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ జనాభాకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల రిజర్వేషన్లకు సంబంధించిన అనేక అంశాలు న్యాయస్థానాల్లో నిలబడడం లేదని ఆయన పేర్కొన్నారు. కులగణన ద్వారా వచ్చిన గణాంకాలు సామాజిక న్యాయం అమలుకు బలమైన ఆధారంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. దేశంలో సుమారు ఎనభై కోట్ల మంది ఓబీసీలు ఉన్నారని పేర్కొంటూ, వారికి విద్య, ఉద్యోగాలు, పదోన్నతులు, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఓబీసీల హక్కుల సాధనకు మద్దతు ఇచ్చే రాజకీయ శక్తులకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని ఓబీసీ సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి దశలవారీగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించాలని సదస్సులో తీర్మానించినట్లు తెలిపారు. ఓబీసీ కులగణన, రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే లక్షలాది మందితో ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో ఉద్యమం చేపడతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

### పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు

### భూసేకరణ, పునరావాస అంశాలపై విస్తృత చర్చ

### రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**నల్గొండ, అక్టోబర్ 4 :**

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రధానంగా భూసేకరణ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ఆలస్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పునరావాసం, పునర్నిర్మాణ పరిహారానికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిబంధనల ప్రకారం వేగంగా అందించాలని, వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలు కూడా సమానంగా పరిరక్షించబడాలని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా సమీక్షించారు. వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా పొందేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు. పరిపాలనా, సాంకేతిక అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు శంకర్ నాయక్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

### జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలు

### మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం

### అన్ని వర్గాల భాగస్వామ్యంతో వేడుకలకు రూపకల్పన

### మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



**సిద్దిపేట, అక్టోబర్ 4 :**

సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా పదేళ్ల పండుగను నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, ఆకాంక్షలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. 1983 నుంచే సిద్దిపేట జిల్లా డిమాండ్ ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ అది చాలా కాలం నినాదంగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, వ్యాపారులు, విద్యార్థులు వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌకర్యాలు విస్తరించడంతో పాటు అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. గోదావరి జలాలు, రైల్వే సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో అంశాలు సిద్దిపేట ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని వివరించారు. సిద్దిపేట జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హరీశ్ రావు అన్నారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్ రూపొందించాలని సూచించారు. అలాగే నాటి సిద్దిపేట, నేటి సిద్దిపేట అనే అంశంపై సమగ్ర డాక్యుమెంటరీ రూపొందించాలని ప్రతిపాదించారు. జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులను యువతకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు. అక్టోబర్ 11న జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక, సాహిత్య, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జర్నలిస్టులు, కవులు, రచయితలు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తల ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి, సాధించిన ఫలితాలపై చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ సూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండు భూపేష్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు, రచయిత, వైద్య, న్యాయవాది, వ్యాపార, విశ్రాంత ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేట పదేళ్ల పండుగను ప్రజల పండుగగా మార్చి జిల్లా ఘనతను దేశానికి చాటాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.

# ఈ నెల 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను అక్టోబర్ 5, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ వేదిక ఉ పయోగపడుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించే సమయంలో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇప్పటికే ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు తమ పాత అర్జీ రశీదు/ఫిర్యాదు రసీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల పాత ఫిర్యాదు వివరాలను పరిశీలించి, తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉ ందని పేర్కొన్నారు. అర్జీల స్వీకరణ ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తమ ప్రాంతానికి సమీపంలోని సంబంధిత కార్యాలయాలను ప్రజలు సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.





## బాలల హక్కుల పరిరక్షణపై కమిషన్ సభ్యురాలి పర్యటన

### 06, 07 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో పలు సంస్థల తనిఖీ

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, అక్టోబర్ 04: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. పద్మలత అక్టోబర్ 06,07 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో బాలల హక్కుల చట్టాల అమలు, సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి షేక్ రుక్సానా సుల్తానా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 06న అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు మరియు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలను కమిషన్ సభ్యురాలు సందర్శించి పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహాలను తనిఖీ చేస్తారు. అక్టోబర్ 07న సంరక్షణ కేంద్రాల సిబ్బందితో బాలల హక్కులు, అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమలపై సమీక్షా నిర్వహిస్తారు. తరువాత కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శిస్తారు. అక్కడ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. కమిషన్ సభ్యురాలి పర్యటనలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కేటాయించిన విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉ ండాలని సూచించింది.

# సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులచే వారాంతపు ప్రత్యేక 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు (జూ) వారాంతంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు, దీని ఫలితంగా 119 మంది నిందితులను పట్టుకున్నారు.

వాహనాల వారీగా నమోదైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి:

ద్విచక్ర వాహనాలు: 101

త్రిచక్ర వాహనాలు: 04

నాలుగు చక్రాల వాహనాలు: 14

భారీ వాహనాలు: 00

నిందితులను వారి రక్తంలో మద్యం స్థాయిల (దీూజ) ఆధారంగా ఇలా వర్గీకరించారు:

88 మంది నిందితులలో దీూజ స్థాయిలు 36 ఎస్త్ర/100 ఎశ్రీ నుండి 200 ఎస్త్ర/100 ఎశ్రీ మధ్య ఉన్నాయి

22 మంది నిందితులలో దీూజ స్థాయిలు 201 ఎస్త్ర/100 ఎశ్రీ నుండి 300 ఎస్త్ర/100 ఎశ్రీ మధ్య ఉన్నాయి

09 మంది నిందితులలో దీూజ స్థాయిలు 301 ఎస్త్ర/100 ఎశ్రీ నుండి 550 ఎస్త్ర/100 ఎశ్రీ మధ్య ఉన్నాయి

నిందితులందరినీ గౌరవనీయులైన న్యాయస్థానం ముందు హాజరుపరుస్తారు.

మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి స్పష్టం చేస్తున్నారు. ఎవరైనా మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, వారిపై 'భారతీయ న్యాయ సంహిత, 2023'లోని సెక్షన్ 105 (హత్యగా పరిగణించబడని నరహత్య – జబశ్రీజూఖఎశ్రీవ ఆశీఎఱఎఱఅవ చీశీ ాఎశీబఅఱఅస్త్ర శీ వీబతీవవతీ) కింద కేసులు నమోదు చేస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

గత వారంలో (28.09.2026 నుండి 03.10.2026 వరకు)

న్యాయస్థానాలలో మొత్తం 115 'డ్రంక్ అండ్ డ్రైవ్' (ణఱ) కేసులు పరిష్కరించబడ్డాయి, వీటిలో:

(06) మందికి జరిమానా ం జైలు శిక్ష పడింది,

(00) మందికి జరిమానా ం సామాజిక సేవ విధించబడింది,

(109) మందికి కేవలం జరిమానా మాత్రమే విధించబడింది.





## ఐదుగురు పిల్లలను కనండి

**హిందూ యువత త్వరగా పెళ్లి చేసుకోవాలి: గజేంద్రసింగ్ పటేల్**
**జనాభా మార్పులపై ఆందోళనతోనే ఐదుగురు పిల్లల సూచన**

భోపాల్, అక్టోబర్ 4: హిందూ యువత త్వరగా వివాహం చేసుకుని ఐదుగురు పిల్లలను కనాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్--బర్వానీ ఎంపీ గజేంద్రసింగ్ పటేల్ పిలుపునిచ్చారు. బర్వానీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో 20--22 ఏళ్ల వయసులోనే వివాహాలు జరిగేవని, కుటుంబాల్లో నలుగురు, ఐదుగురు, ఆరుగురు, ఏడుగురు పిల్లలు కూడా ఉండేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం యువత 30, 35, 37 ఏళ్ల వరకు వివాహం చేసుకోకుండా, వివాహం తర్వాత కూడా ఒకే సంతానానికి పరిమితమవుతోందని అన్నారు. దీని కారణంగా సనాతనీల జననాల రేటు 1.9కు తగ్గిందని ఆయన పేర్కొంటూ, పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని యువత కుటుంబాల విస్తరణపై దృష్టి పెట్టాలని సూచించారు. పటేల్ వ్యాఖ్యల వెనుక ప్రధానంగా జనాభా ధోరణుల్లో మార్పులపై ఆయన వ్యక్తం చేసిన ఆందోళనే కనిపిస్తోంది. స్వాతంత్ర్యం తర్వాత వివిధ వర్గాల జనాభా నిష్పత్తిలో మార్పులు వచ్చాయని, 2011 జనగణనను ప్రస్తావిస్తూ ఒక వర్గం జనాభా గ్రాఫ్ తగ్గగా మరో వర్గం పెరిగిందని ఆయన వాదించారు. ప్రస్తుతం నాలుగురు పిల్లల్లో ఒకరు హిందూ, ముగ్గురు మరో వర్గానికి చెందినవారన్న ఆయన వ్యాఖ్యలు కూడా ఇదే ఆందోళనలో భాగంగా చేశారు. మరోవైపు యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, ఆడంబర ధోరణిపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ డీజే, డ్రగ్స్, దారికి వ్యతిరేకంగా 3డీ ప్రచారం అవసరమని అన్నారు. కుటుంబాలు, బలోపేతానికి జిమ్‌లు, సంప్రదాయ కుస్తీ అఖాడాలను ప్రోత్సహించాలని కూడా పిలుపునిచ్చారు.

## క్రెడిట్ కార్డు మోసాల్లో ఎవరు బాధ్యులు?

న్యూఢిల్లీ, అక్టోబరు 4 : క్రెడిట్ కార్డుతో అనధికారిక లావాదేవీలు జరిగినప్పుడు కార్డుదారుడే మొత్తం నష్టానికి బాధ్యత వహించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. మోసం ఎలా జరిగింది, లావాదేవీ జరిగిన తర్వాత ఎంత త్వరగా బ్యాంకుకు సమాచారం ఇచ్చారు, కార్డుదారుడి నిర్లక్ష్యం ఉందా అనే అంశాల ఆధారంగా బాధ్యత నిర్ణయిస్తారు. రద్దీగా ఉండే ప్రదేశంలో క్రెడిట్ కార్డు పోయిందని అనుకుందాం. అది గుర్తించేలోపే దుండగులు కార్డును ఉపయోగించి కొనుగోళ్లు చేసినట్లయితే.. కార్డుదారుడు వెంటనే బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి. బ్యాంకుకు ఫిర్యాదు చేసిన వెంటనే కార్డును బ్లాక్ చేయించుకోవాలి. కార్డు పోయిందని లేదా దొంగతనానికి గురైందని బ్యాంకుకు తెలియజేసి, దాన్ని బ్లాక్ చేసిన తర్వాత జరిగే అనధికారిక లావాదేవీలకు సాధారణంగా బ్యాంకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే బ్యాంకుకు సమాచారం ఇవ్వకముందే జరిగిన లావాదేవీల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఆ లావాదేవీలు ఎలా జరిగాయి, కార్డుదారుడి నిర్లక్ష్యం ఏమైనా ఉందా, బ్యాంకు నిబంధనలు ఏమిటి వంటి అంశాలను పరిశీలించిన తర్వాత బాధ్యతను నిర్ణయిస్తారు. అనధికారిక ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీల్లో కస్టమర్ల బాధ్యతను పరిమితం చేసేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మార్గదర్శకాలు ఉన్నాయి. బ్యాంకు నిర్లక్ష్యం లేదా లోపం కారణంగా అనధికారిక లావాదేవీ జరిగితే కస్టమర్‌పై ఎలాంటి బాధ్యత లేకపోవచ్చు. బ్యాంకు లేదా కస్టమర్ తప్పిదం లేకుండా మూడో పక్షం ద్వారా మోసం జరిగిన సందర్భంలో.. అనధికారిక లావాదేవీ గురించి సమాచారం అందిన మూడు పని దినాల్లోపు బ్యాంకుకు తెలియజేస్తే కస్టమర్ బాధ్యత పరిమితమయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ నిబంధనలు ఉన్నంత మాత్రాన ప్రతి సందర్భంలోనూ ఆటోమేటిక్‌గా మొత్తం నగదు తిరిగి వస్తుందని భావించకూడదు. లావాదేవీ జరిగిన తీరు, కస్టమర్ నుంచి జరిగిన నిర్లక్ష్యం, బ్యాంకుకు సమాచారం ఇచ్చిన సమయం వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే కార్డు పోయినా, అనుమానాస్పద లావాదేవీ కనిపించినా వెంటనే బ్యాంకుకు సమాచారం ఇచ్చి కార్డును బ్లాక్ చేయించుకోవడం అత్యంత ముఖ్యం.







## డీమార్ట్‌లో మీ ఉత్పత్తులు అమ్మాలంటే

న్యూఢిల్లీ, అక్టోబరు 4 : సొంతంగా వ్యాపారం ప్రారంభించి ఆహార ఉత్పత్తులు, నిత్యావసరాలు, గృహోపకరణాలు తయారు చేసే చిన్న తయారీదారులకు తమ ఉత్పత్తులను పెద్ద మార్కెట్‌లోకి తీసుకెళ్లడం ప్రధాన సవాల్‌గా ఉంటుంది. గ్రామాలు, చిన్న పట్టణాల్లో స్థానిక దుకాణాలకు మాత్రమే పరిమితమైతే అమ్మకాలు పెరగడం కష్టమే. ఇలాంటి తయారీదారులకు డీమార్ట్ వంటి పెద్ద రిటైల్ సంస్థల ద్వారా విస్తృత మార్కెట్ లభించే అవకాశం ఉంటుం ది. డీమార్ట్ సాధారణంగా స్టోర్ల నిర్వహణ కోసం ప్రాంచైజీలు ఇవ్వదు. అయితే అర్హత ఉన్న తయారీదారులను సరఫరాదారులు లేదా విక్రేతలుగా చేర్చుకునే విధానం ఉంటుంది. ఉత్పత్తిలో ఇవి కీలకం డీమార్ట్ వంటి రిటైల్ సంస్థలో ఉత్పత్తులను విక్రయించాలంటే నాణ్యతతో పాటు ధర కూడా పోటీగా ఉండాలి. ముఖ్యంగా మూడు అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. ధర--నాణ్యత సమతుల్యత: ప్రముఖ బ్రాండ్లకు దీటైన నాణ్యతతో పాటు సామాన్య వినియోగదారులకు అందుబాటులో ఉండే ధర ఉండాలి. ఆకర్షణీయమైన ప్యాకేజింగ్: ఉత్పత్తి రవాణాలో దెబ్బతినకుండా ఉండటంతో పాటు వినియోగదారులను ఆకట్టుకునేలా ప్యాకేజింగ్ ప్రమాణాలను పాటించాలి. స్థిరమైన ఉత్పత్తి సామర్థ్యం: రిటైల్ సంస్థ నుంచి ఆర్డర్లు వచ్చినప్పుడు డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయంగా సరుకును సరఫరా చేసే సామర్థ్యం తయారీదారుడికి ఉండాలి. వ్యాపారం, ఉత్పత్తి రకాన్ని బట్టి అవసరమైన చట్టపరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి. సాధారణంగా జీఎస్టీ నమోదు, వ్యాపార పాన్ వివరాలు అవసరం కావచ్చు. ఆహార ఉత్పత్తులైన పచ్చళ్లు, అప్పడాలు, పొడులు, పిండి పదార్థాలు తదితరాలకు సంబంధిత ఆహార భద్రతా అనుమతులు ఉండాలి. ఇతర ఉత్పత్తులకు వాటి స్వభావాన్ని బట్టి సంబంధిత పరీక్షలు, ప్రమాణాలు అవసరం కావచ్చు.

మనిషి నాగరికత అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే ప్రతి యుగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చినవి ఆ కాలంలోని నిర్మాణాలే. ప్రాచీన దేవాలయాలు, కోటలు, రాజప్రాసాదాల నుంచి నేటి ఆకాశహర్మ్యాల వరకు ప్రతి నిర్మాణం వెనుక వాస్తు శిల్పుల ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటుంది. భవన నిర్మాణ రంగంలో సేవలందిస్తున్న వాస్తు నిపుణుల కృషిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ తొలి సోమవారం ప్రపంచ వాస్తు దినాన్ని నిర్వహిస్తారు. సమాజ అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సౌకర్యవంతమైన, అందమైన నిర్మాణాలను రూపొందించడంలో వాస్తు నిపుణుల పాత్రను ఈ సందర్భంగా ప్రపంచం గుర్తుచేసుకుంటుంది. వాస్తు శిల్పం అనేది కేవలం భవనాలకు నమూనాలు రూపొందించడం మాత్రమే కాదు. మానవ అవసరాలు, పర్యావరణ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానం, సాంస్కృతిక విలువలు వంటి అనేక అంశాలను సమన్వయం చేస్తూ నిర్మాణాలకు రూపకల్పన చేయడం ఒక కళ. ఒక మంచి నిర్మాణం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు నగరాలకు ప్రత్యేక గుర్తింపును కూడా తీసుకువస్తుంది. అందుకే వాస్తు నిపుణులను ఆధునిక నగరాల రూపకర్తలుగా అభివర్ణిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా జరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో వాస్తు రంగానికి ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేందుకు నివాస గృహాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, వైద్యశాలలు, రవాణా కేంద్రాలు వంటి అనేక నిర్మాణాలు అవసరమవుతున్నాయి. ఈ నిర్మాణాలు కేవలం ఉపయోగకరంగా ఉండటమే కాకుండా భద్రత, సౌలభ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను కూడా దృష్టిలో ఉంచుకుని రూపుదిద్దుకోవాల్సి ఉంటుంది. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించేది వాస్తు నిపుణులే.

- డెస్క్, అక్టోబర్ 4 :

ఆధునిక కాలంలో పర్యావరణ హిత నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెరుగుతోంది. విద్యుత్ వినియోగాన్ని తగ్గించే విధంగా, సహజ కాంతి మరియు గాలి ఎక్కువగా అందే విధంగా భవనాలను రూపొందిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, సౌరశక్తి వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలు నిర్మాణాల్లో భాగమవుతున్నాయి. పర్యావరణానికి మేలు చేసే ఈ విధమైన నిర్మాణాలు భవిష్యత్తు తరాలకు కూడా ఉపయోగపడేలా ఉంటాయి. భారతదేశం వంటి దేశాల్లో వాస్తు శిల్పానికి వేల ఏళ్ల చరిత్ర ఉంది. అజంతా, ఎల్లోరా గుహలు, కోణార్క సూర్య దేవాలయం, తాజ్ మహల్, చార్మినార్ వంటి నిర్మాణాలు భారత వాస్తు నైపుణ్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చాయి. ఇవి కేవలం నిర్మాణాలు మాత్రమే కాకుండా చరిత్ర, సంస్కృతి, కళాత్మకతకు ప్రతీకలుగా నిలిచాయి. నేటి ఆధునిక నిర్మాణాల్లో కూడా ఆ సృజనాత్మకతకు కొత్త రూపం కనిపిస్తోంది.వాస్తు నిపుణులు కేవలం భవనాల రూపకల్పనకే పరిమితం కావడం లేదు. నగరాల ప్రణాళిక, ప్రజా ప్రదేశాల అభివృద్ధి, రవాణా వ్యవస్థల రూపకల్పన, విపత్తులను తట్టుకునే నిర్మాణాల రూపుదిద్దడం వంటి అనేక రంగాల్లో తమ సేవలను అందిస్తున్నారు. ప్రజల అవసరాలను ముందుగానే అంచనా వేసి భవిష్యత్తుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో పట్టణాలు మరింత సౌకర్యవంతంగా మారుతున్నాయి.



# సృజనాత్మక నిర్మాణాలకు వాస్తు శిల్పులే ఆధారం

## ఆధునిక నగరాల రూపకల్పనలో కీలక పాత్ర

### పర్యావరణ హిత నిర్మాణాలకు పెరుగుతున్న ప్రాధాన్యం



ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న ప్రస్తుత కాలంలో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు రూపొందించడం అత్యంత అవసరమైంది. భూకంపాలు, వరదలు, తుఫానులు వంటి పరిస్థితులను తట్టుకునే విధంగా భవనాల రూపకల్పన జరగాలి. ఈ దిశగా వాస్తు నిపుణులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తూ నిర్మాణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ఇది ఎంతో కీలకం. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో వాస్తు రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. త్రిమితీయ నమూనాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత రూపకల్పనలు, ఆధునిక నిర్మాణ పద్ధతులు రంగాన్ని కొత్త దిశలో తీసుకెళ్తున్నాయి. నిర్మాణం ప్రారంభానికి ముందే పూర్తి రూపాన్ని చూడగలిగే సౌకర్యం అందుబాటులోకి రావడంతో ప్రణాళికలు మరింత సమర్థవంతంగా అమలవుతున్నాయి. ప్రపంచ వాస్తు దినం సందర్భంగా వాస్తు నిపుణుల సేవలను గుర్తించడంతో పాటు సుస్థిర నిర్మాణాల అవసరాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. పెరుగుతున్న జనాభా, పరిమిత వనరులు, పర్యావరణ సవాళ్ల మధ్య భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా వాస్తు రంగం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచ వాస్తు దినం నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వాస్తు నిపుణుల ప్రతిభను గౌరవించే సందర్భంగా నిలుస్తోంది. మనం నివసించే ఇళ్లు, పనిచేసే కార్యాలయాలు, చదువుకునే విద్యాసంస్థలు, విశ్రాంతి తీసుకునే ప్రజా ప్రదేశాల వెనుక వారి సృజనాత్మక ఆలోచనలు దాగి ఉంటాయి. సమాజ అవసరాలను అర్థం చేసుకుని భవిష్యత్తుకు అనుగుణమైన నిర్మాణాలను అందిస్తున్న వాస్తు శిల్పులు ఆధునిక అభివృద్ధికి నిజమైన రూపకర్తలుగా నిలుస్తున్నారు.

# జ్ఞాన దీపాలైన ఉపాధ్యాయులు

నేటి ప్రపంచంలో విద్యా రంగం వేగంగా మారుతోంది. కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, బోధనా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల జ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సమాజంపై అవగాహన వంటి అంశాలను కూడా బోధిస్తున్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా వారిని సిద్ధం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరింత ప్రశంసనీయం. పరిమిత సౌకర్యాలు, వనరుల కొరత, ప్రయాణ ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థులకు విద్య అందించడంలో వారు ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు స్వయంగా కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నత విద్య వైపు నడిపిస్తున్నారు. వారి కృషి వల్లే అనేక మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకుంటున్నారు. విద్యార్థులలో విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థులలో నాటడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. సమాజంలో పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన మానసిక బలాన్ని కూడా అందిస్తున్నారు. కేవలం పాఠాలు చెప్పడం మాత్రమే కాకుండా జీవితాన్ని ఎలా గడపాలో నేర్పించే మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఉపాధ్యాయుల బాధ్యతలు మరింత పెరిగాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భవిష్యత్తు లక్ష్యాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై కూడా వారు దృష్టి సారించాల్సి వస్తోంది. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని వారికి తగిన సలహాలు ఇవ్వడం, ప్రోత్సహించడం వంటి బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు తమ జీవితాలను విద్యార్థుల అభివృద్ధికి అంకితం చేస్తున్నారు. అనేక సందర్భాల్లో వ్యక్తిగత సౌకర్యాలను పక్కనపెట్టి విద్యార్థుల కోసం శ్రమిస్తున్నారు. పాఠశాల సమయానికి మించి కూడా విద్యార్థుల కోసం సమయం కేటాయిస్తూ వారికి సహాయం చేస్తున్నారు. ఈ సేవాభావమే ఉపాధ్యాయ వృత్తిని అత్యంత గొప్పదిగా నిలబెడుతోంది. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను స్మరించుకోవడంతో పాటు వారి సంక్షేమంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మెరుగైన వసతులు, శిక్షణ అవకాశాలు, వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన మద్దతు కల్పించడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు. ఉపాధ్యాయులు బలంగా ఉంటేనే విద్యా రంగం బలపడుతుంది. విద్యా రంగం బలపడితేనే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. జ్ఞానాన్ని పంచే ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి అమూల్యమైన సంపద.

## ఉపాధ్యాయుల సేవలకు ప్రపంచ వందనం

### విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది

### విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర

### మారుతున్న కాలానికి అనుగుణంగా గురువుల బాధ్యతలు



డెస్క్, అక్టోబర్ 4 : ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. సమాజ నిర్మాణంలో, దేశాభివృద్ధిలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనది. విద్య అనేది కేవలం పుస్తకాలలోని పాఠాలను నేర్పించడం మాత్రమే కాదు. మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించడం, విలువలను అందించడం, సమాజం పట్ల బాధ్యతను కల్పించడం కూడా విద్యలో భాగమే. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించే వారే ఉపాధ్యాయులు. అందుకే వారిని జాతి నిర్మాతలుగా అభివర్ణిస్తారు. ఒక విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యధిక ప్రభావం చూపే వ్యక్తి ఉపాధ్యాయుడు. చిన్న వయసులోనే విద్యార్థుల ఆలోచనలను సరైన దిశలో నడిపిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తారు. తరగతి గదిలో చెప్పే ప్రతి పాఠం కేవలం పరీక్షల కోసం మాత్రమే కాకుండా జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. ఒక ఉపాధ్యాయుడు ఇచ్చే ప్రేరణ ఎంతోమంది విద్యార్థుల జీవితాలను మార్చగలదు. ఎన్నో సందర్భాల్లో విద్యార్థులు తమ విజయాలకు కారణం తమ గురువులేనని గర్వంగా చెబుతుంటారు. ఇది ఉపాధ్యాయుల ప్రభావానికి నిదర్శనం. ప్రాచీన భారతదేశంలో గురుకుల వ్యవస్థ నుంచి నేటి ఆధునిక విద్యా విధానం వరకు ఉపాధ్యాయుల స్థానం అత్యంత గౌరవప్రదంగానే కొనసాగుతోంది. కాలం మారినా, బోధనా పద్ధతులు మారినా, విద్యా విధానాలు మారినా గురువు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. ఒకప్పుడు చెట్టు కింద కూర్చొని విద్యను బోధించిన గురువులు ఉండేవారు. నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులకు బోధిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థుల అభివృద్ధి కోసం పనిచేయాలనే అంకితభావం మాత్రం యథాతథంగా కొనసాగుతోంది.





# కైనత్ ఇంతియాజ్ వీడ్కోలు

**కరాచీ, అక్టోబరు 4 :**

పాకిస్థాన్ మహిళా క్రికెటర్, పేసర్ కైనత్ ఇంతియాజ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. దాదాపు 13 ఏళ్ల పాటు పాకిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె.. ఇక తన క్రికెట్ కెరీర్‌ను ముగిస్తున్నట్లు ఆదివారం ప్రకటించింది. మూడేళ్ల క్రితమే తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన కైనత్.. ఇకపై జట్టులో అవకాశాలు రావడం కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. క్రికెట్‌కు దూరమైన తర్వాత తన తల్లి సలీమా ఇంతియాజ్ బాటలో నడవాలని కైనత్ నిర్ణయించుకుంది. తల్లి మాదిరిగానే తాను కూడా అంతర్జాతీయ మ్యాచ్ రిఫరీగా కొనసాగాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. ఇటీవల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్వహించిన జాతీయ మహిళల అండర్-19 టోర్నమెంట్‌లో కైనత్ రిఫరీగా వ్యవహరించింది. ఇక భవిష్యత్తులో ఈ రంగంలో మరింత ముందుకు వెళ్లాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది.

# అభిషేక్ శర్మ ట్రేడ్ వార్తలపై సన్‌రైజర్స్ క్లారిటీ

హైదరాబాద్, అక్టోబరు 4 : ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ట్రేడ్‌పై ఊహాగానాలు మొదలయ్యాయి. ఇషాన్ కిషన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై అభిషేక్ అసంతృప్తిగా ఉన్నారని, అందుకే జట్టు మారాలని భావిస్తున్నారని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కే. షణ్ముగం ఖండించినట్లు సమాచారం. ఐపీఎల్ 2026లో ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేని సమయంలో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. 2027 సీజన్‌లోనూ ఇషాన్‌కే కెప్టెన్సీ కొనసాగించాలన్న నిర్ణయంతో అభిషేక్ అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరిగింది. తనకు కూడా కెప్టెన్సీపై ఆసక్తి ఉందని, అందుకే కొత్త జట్టును వెతుక్కుంటున్నాడనే వార్తలు వచ్చాయి. అభిషేక్ శర్మను తమ జట్టులోకి తీసుకునేందుకు ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ పేరు కూడా ఈ జాబితాలో వినిపిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ కోచింగ్ బృందంలో అభిషేక్‌కు సన్నిహితుడిగా భావించే యువరాజ్ సింగ్ ఉండటాన్ని కూడా ఈ చర్చలకు కారణంగా పేర్కొంటున్నారు. అయితే వీటిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. అభిషేక్ శర్మ ట్రేడ్ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఒప్పందం ఖరారు కాలేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కే. షణ్ముగం.. అభిషేక్ అసంతృప్తిగా ఉన్నారన్న వార్తలను 'నిజం కాదు' అని ఖండించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీంతో ఐపీఎల్ 2027కు ముందు అభిషేక్ శర్మ నిజంగానే జట్టు మారతాడా? లేక సన్‌రైజర్స్‌తోనే కొనసాగుతాడా? అనేది రిటెన్షన్, అధికారిక ట్రేడ్ నిర్ణయాల తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.





# సంజూ శాంసన్‌కు పెరిగిన పోటీ

**ముంబై, అక్టోబరు 4 :**

**భారత టీ20 జట్టులో చోటు కోసం పోటీ పెరుగుతున్న వేళ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌పై చర్చ మొదలైంది. నిలకడలేని ప్రదర్శన అతడి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026, అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌లో మెరుగ్గా రాణించిన సంజూ.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆశించిన స్థాయిలో ఆడలేకపోయాడు. ఆసియా క్రీడల్లో సంజూ శాంసన్ రెండు మ్యాచ్‌లు ఆడాడు. అయితే మొత్తం తొమ్మిది పరుగులు మాత్రమే చేశాడు. కీలక సమయాల్లో తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వకపోవడంతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు.**

గత సిరీస్‌ల్లో చూపించిన ఫామ్‌ను కొనసాగించలేకపోవడం అతడి స్థానంపై చర్చకు దారితీసింది. వెస్టిండీస్‌తో జరగనున్న టీ20 సిరీస్ నేపథ్యంలో భారత జట్టులో పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉండటంతో సంజూ స్థానంపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే టీ20 జట్టులో చోటు కోసం పలువురు ప్రతిభావంతులైన ఆటగాళ్లు పోటీ పడుతున్నారు. అఫ్ఘానిస్థాన్ సిరీస్‌లో చూపించిన ఫామ్‌ను కొనసాగించలేకపోవడం సంజూకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాబోయే సిరీస్‌ల్లో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే సంజూ శాంసన్ స్థిరమైన ప్రదర్శనతో ఆకట్టుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా జట్టులో చోటు కోసం పోటీ మరింత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అవకాశం కీలకంగా మారనుంది.

# ధోనీ మాటలే స్ఫూర్తి.. షై హోప్ ఆసక్తికర వ్యాఖ్యలు

**భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకున్నప్పటికీ.. చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్ అదిరిపోయే ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ షై హోప్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్సర్లతో 162 పరుగులు చేసిన హోప్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం తన బ్యాటింగ్ వెనుక ఉన్న స్ఫూర్తిని వెల్లడిస్తూ టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీతో గతంలో జరిగిన సంభాషణను గుర్తు చేసుకున్నాడు.**

**చండీగఢ్, అక్టోబరు 4 :**

ధోనీ తనకు ఇచ్చిన సలహా ఇప్పటికీ గుర్తుందని హోప్ చెప్పాడు. బ్యాటర్ అనుకున్నదానికంటే ఎక్కువ సమయం తన వద్ద ఉంటుందని ధోనీ చెప్పినట్లు వివరించాడు. ఫలితంపై ఆందోళన చెందకుండా ప్రక్రియను నమ్మాలని సూచించాడని తెలిపాడు.

ఆటను చిన్న చిన్న భాగాలుగా విభజించుకుని పరిస్థితిని అర్థం చేసుకోవాలని, ఇన్నింగ్స్ చివరి దశలో బౌండరీలు సాధించే మార్గాలను వెతుక్కోవాలని ధోనీ చెప్పినట్లు హోప్ వెల్లడించాడు. భారత్‌తో మూడో వన్డేలో తాను అదే సూత్రాన్ని అనుసరించానని చెప్పాడు. లక్ష్యం గురించి ఆలోచించకుండా బౌండరీలపై దృష్టి పెట్టానని, తన ఇన్నింగ్స్ క్రెడిట్ ధోనీకే దక్కుతుందని పేర్కొన్నాడు. భారత్ కొన్ని ఓవర్లు వెనుకబడి ఉందని గమనించిన హోప్.. ఇన్నింగ్స్ చివరి దశలో ఫీల్డింగ్ నిబంధనల కారణంగా సర్కిల్‌లోకి అదనపు ఫీల్డర్ రావాల్సి ఉంటుందని అంచనా వేసినట్లు చెప్పాడు. భారీ స్కోరును కాపాడుకోవాల్సిన సమయంలో ఐదుగురు ఫీల్డర్లు సర్కిల్‌లో ఉండటం బౌలింగ్ జట్టుకు సవాలుగా మారుతుందని వివరించాడు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని బ్యాటింగ్ చేశానని హోప్ తెలిపాడు. తన ప్రణాళికకు తగ్గట్టుగానే ఫలితం రావడంతో వెస్టిండీస్ ఘన విజయం సాధించిందని పేర్కొన్నాడు.





# సిరీస్ గెలిచినా గిల్‌కు అరుదైన రికార్డు

**వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుంది. ముల్లాన్‌పూర్‌లో జరిగిన మూడో వన్డేలో 352 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్.. భారత్‌కు షాకిచ్చింది. ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి క్లీన్‌స్వీప్ నుంచి తప్పించుకుంది. అయితే మూడో వన్డేలో భారత్ ఓడిపోయినప్పటికీ.. సిరీస్‌లో అద్భుతంగా రాణించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.**

**ముల్లాన్‌పూర్, అక్టోబరు 4 :**

మూడో వన్డేలో గిల్ విఫలమైనప్పటికీ.. తొలి రెండు మ్యాచ్‌ల్లో అతడి బ్యాట్ నుంచి వరుసగా శతకం, డబుల్ సెంచరీ వచ్చాయి. మొత్తం మూడు మ్యాచ్‌ల్లో కలిపి గిల్ 334 పరుగులు సాధించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో సిరీస్ ఉత్తమ ఆటగాడిగా నిలిచాడు. ఈ అవార్డుతో గిల్ అరుదైన ఘనత సాధించాడు. భారత్ తరఫున వన్డేల్లో అత్యధికసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో దిగ్గజాలు యువరాజ్ సింగ్, ఎంఎస్ ధోనీ, సౌరవ్ గంగూలీల సరసన నిలిచాడు. వీరందరూ ఏడేసి సార్లు ఈ అవార్డు అందుకోగా.. గిల్ కూడా ఏడోసారి ఈ ఘనత సాధించాడు. కేవలం 70 వన్డే ఇన్నింగ్స్‌ల్లోనే గిల్ ఏడుసార్లు సిరీస్ ఉత్తమ ఆటగాడిగా నిలవడం విశేషం. అతడి అవార్డులన్నీ 2022 తర్వాతే రావడం గమనార్హం. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ 15 అవార్డులతో అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ 11 అవార్డులతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. యువీ, ధోనీ, గంగూలీలతో కలిసి గిల్ మూడో స్థానంలో ఉన్నాడు. త్వరలో న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో గిల్ మరోసారి రాణిస్తే ఈ దిగ్గజాల రికార్డును అధిగమించే అవకాశం ఉంది.



## సింగీతం శ్రీనివాసరావుకు అంతిమ వీడ్కోలు

భారతీయ చిత్ర పరిశ్రమలో తనదైన ప్రయోగాలతో చెరగని ముద్ర వేసిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుకు ఆదివారం అంతిమ వీడ్కోలు పలకనున్నారు. 94 ఏళ్ల ఆయన వయోభారంతో తలెత్తిన అనారోగ్య సమస్యలతో శనివారం రాత్రి చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతితో తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో విషాదం అలుముకుంది. అభిమానులు, ప్రముఖుల నివాళుల సింగీతం పార్థివదేహాన్ని చెన్నైలోని విరుగంబాక్కంలోని ఆయన నివాసంలో ప్రజలు, కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. అభిమానులు, సహచరులు, సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులర్పిస్తున్నారు. కమల్ హాసన్, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సహా పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని, సినీ రంగానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

దాదాపు ఆరు దశాబ్దాల సినీ ప్రస్థానంలో సింగీతం శ్రీనివాసరావు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఎన్నో వైవిధ్యభరిత చిత్రాలను తెరకెక్కించారు. 'పుష్పక విమానం', 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం', 'మైఖేల్ మదన కామరాజన్', 'అపూర్వ సోదరులు' వంటి చిత్రాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మూసధోరణికి భిన్నంగా కొత్త కథాంశాలను ఎంచుకోవడం, సాంకేతికంగా వినూత్న ప్రయోగాలు చేయడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా కూడా గుర్తింపు పొందారు. వయసు మీద పడినా సినిమాపై సింగీతంకు ఉన్న ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. తొంభై ఏళ్ల వయసు దాటిన తర్వాత కూడా కొత్త ఆలోచనలతో సినిమాలు చేయాలనే తపనను కొనసాగించారు. ఆయన చివరి దర్శకత్వ చిత్రం 'సింగ్ గీతం' 2026లో విడుదలైంది. సినిమా పట్ల ఆయనకున్న అంకితభావా నికి ఈ చిత్రం నిదర్శనంగా నిలిచింది. ఆదివారం చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆయన మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటుగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



## ఓటీటీల్లో మమితా హవా

'ప్రేమలు' సినిమాతో ఒక్కసారిగా దక్షిణాది ప్రేక్షకులకు చేరువైన మలయాళ బ్యూటీ మమితా బైజు.. వరుస విజయాలతో తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. థియేటర్లలోనే కాకుండా ఓటీటీ వేదికలపైనా ఆమె నటించిన సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. తాజాగా మమితా బైజు నటించిన మూడు చిత్రాలు ఒకేసారి మూడు ప్రముఖ ఓటీటీ వేదికల్లో అగ్రస్థానాల్లో ట్రెండ్ అవుతుండటం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. సూర్య, మమితా బైజు జంటగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' థియేటర్లలో మంచి స్పందన అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన ఈ చిత్రం డిజిటల్‌గానూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇండియా స్థాయిలో నెట్‌ఫ్లిక్స్ ట్రెండింగ్ జాబితాలో అగ్రస్థానంలో నిలవడంతో మమితా బైజు పేరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. నివిన్ పౌలీ, మమితా బైజు కలిసి నటించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' కూడా జియోహాట్‌స్టార్‌లో మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది. ఓటీటీలోకి వచ్చిన వెంటనే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన అందుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.

## దసరా బాక్సాఫీస్ బరిలో నాలుగు సినిమాలు

దసరా పండుగ సీజన్ దగ్గరపడుతుండటంతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సందడి మొదలైంది. పండుగ సెలవులను క్యాష్ చేసుకునేందుకు ఈసారి నాలుగు క్రేజీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. భిన్నమైన కథాంశాలు, భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విక్టరీ వెంకటేష్, సూపర్‌స్టార్ రజనీకాంత్, విజయ్ దేవరకొండతో పాటు శ్రీవిష్ణు కూడా ఈ పండుగ రేసులో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.





అందరికంటే ముందుగా అక్టోబరు 9న వెంకటేష్ నటిస్తున్న 'ఆదర్శకుటుంబం' ప్రేక్షకుల ముందుకు రానుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై కుటుంబ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కుటుంబ భావోద్వేగాలతో పాటు క్రైమ్ అంశాలను మేళవించి సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. అదే రోజున శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' కూడా విడుదల కానుంది. నక్సలిజం నేపథ్యంలో సాగే కథకు హాస్యాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు సమాచారం.దసరా బరిలో అసలు సందడి అక్టోబరు 15 నుంచి మొదలుకానుంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఘన విజయం సాధించిన 'జైలర్'కు కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంపై తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో యాక్షన్, వినోదానికి మరింత ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది.అక్టోబరు 16న విజయ్ దేవరకొండ 'రణబాలి'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'టాక్సీవాలా' తర్వాత విజయ్, రాహుల్ సాంకృత్యన్ కలయికలో వస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. రాయలసీమ నేపథ్యంలో సాగే కథలో విజయ్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇలా వరుసగా నాలుగు సినిమాలు విడుదలకు సిద్ధమవడంతో ఈ దసరా సీజన్ టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పోటీ రసవత్తరంగా మారనుంది.



## అందంగా ఉన్నాననే తిరస్కరణలు

బాలీవుడ్ నటి దియా మీర్జా తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న అనుభవాల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తాను అందంగా ఉన్న కారణంగానే కొన్ని మంచి పాత్రలకు ఎంపిక కాలేకపోయానని, దర్శకులు తనను కేవలం ప్రధాన స్రవంతి కథానాయికగా మాత్రమే భావించేవారని ఆమె చెప్పినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అర్థవంతమైన కథలు, విభిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ ఈ అభిప్రాయం తనకు కొన్ని అవకాశాలు దూరం చేసిందని దియా వెల్లడించారు. 2001లో విడుదలైన 'రెహనా హై తేరే దిల్ మే' చిత్రంతో దియా మీర్జా కథానాయికగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. తమిళంలో మాధవన్, రీమా సేన్ నటించిన విజయవంతమైన 'మిన్నలే'కు ఇది హిందీ పునర్నిర్మాణం. ఈ చిత్రంలో మాధవన్, దియా మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తొలి చిత్రంతోనే దియా అందం, నటనపై చర్చ మొదలైంది. మంచి కథాంశాలతో కూడిన అర్థవంతమైన చిత్రాల్లో నటించాలనే కోరిక తనకు ఉన్నప్పటికీ.. దర్శకులు తనను ప్రధాన స్రవంతి సినిమాల కథానాయికగా మాత్రమే చూసేవారని దియా చెప్పినట్లు సమాచారం. అందం కారణంగా కొన్ని పాత్రలకు తాను సరిపోనని భావించి తిరస్కరించిన సందర్భాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తనపై ఏర్పడిన ఈ ముద్ర వల్ల కెరీర్‌లో కొన్ని మంచి అవకాశాలను కోల్పోయినట్లు ఆమె అభిప్రాయపడ్డారు.



## 'ది ప్యారడైజ్' అనంతిక మిస్

నేచురల్ స్టార్ నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన చిత్రం 'ది ప్యారడైజ్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని తొలుత మరో హీరోయిన్ కూడా అందుకున్నారట. ఆమె మరెవరో కాదు.. 'మ్యాడ్', '8 వసంతాలు' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అనంతిక సనీల్ కుమార్. తాజాగా తన 'రొమాంచకం' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనంతిక.. తన సినీ కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'ది ప్యారడైజ్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని తాను ఎందుకు కోల్పోయానో ఆమె వివరించారు. తన అప్పటి వయసుకు తగ్గట్టుగా కనిపించడం, హీరోయిన్ పాత్రకు సరిపోతానా అనే సందేహాలు ఉండటంతో ఆ అవకాశం చేజారిపోయిందని తెలిపారు. తాను చాలా చిన్నగా కనిపించడం వల్ల గతంలోనూ కొన్ని సినిమాల అవకాశాలను కోల్పోయానని అనంతిక చెప్పారు. ముఖ్యంగా నాని తనకు ఎంతో ఇష్టమైన తెలుగు హీరో అని, ఆయనతో కలిసి నటించే అవకాశం రాకపోవడం బాధగా అనిపించిందని తెలిపారు. విజయ్ సేతుపతి వంటి ప్రముఖ నటులతో కలిసి నటించే అవకాశం ఉన్న కొన్ని తమిళ చిత్రాలు కూడా ఇదే కారణంతో తనకు దూరమయ్యాయని వెల్లడించారు. తనకు దక్కని అవకాశాల గురించి ఇప్పుడు ఎక్కువగా ఆలోచించనని అనంతిక స్పష్టం చేశారు. జరిగిన విషయాలను వెనక్కి తిరిగి చూస్తూ బాధపడటం కంటే.. భవిష్యత్తులో వచ్చే మంచి అవకాశాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

Apublished by **KALIDINDI SUMALATHA**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by **RAGHURAMA RAJU KALIDINDI** and printed by **KALIDINDI SUMALATHA** at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467